## కామెడీ కథ

తోలపల్లి ఈశ్వర్

"సమాధి కట్టేశా!"

"నిజమా?!" వామన్రావుగారు ఆశ్చర్యంగా అన్నారు. ఆశ్చర్యంతో పాటు సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి పదవిని సంపాదించినవాడి ముఖంలో సహజంగా వుండే ఆందోళన... ఏ క్షణంలో ప్రభుత్వం కూలిపోయి తమ మంత్రి పదవి ఉష్కాకి అయిపోతుందోననే ఆందోళన కనిపించింది. "నో... ఐ కాంట్ బిలీవ్ ఇట్" అన్నారాయన మళ్లీ.

# సమాధి కట్టేశా చందాలివ్వండి

"నిజం సార్, ఒట్టు. నన్ను నమ్మండి. వాడింక మీ జోలికి రాడు" అన్నాను నేను నమ్మబలుకుతూ.

"ఏమోనయ్యా! నువ్వు టెంపరరీగా ఏదో చెప్తే చేసుండొచ్చేమోగానీ అతనా సమాధిని ఛేదించుకుని మళ్లీ బయటికి రాడని గ్యారంటీ ఏంటి?" అన్నారాయన అనుమానంగా.

"రాడు సార్..." అని అసలేం జరిగిందో నేను ఆయనకు వివరంగా చెప్పాను.

"ఈజిట్?! అదే నిజమైతే నేనొక్కణ్ణే కాదోయ్, మన కాలనీ అంతా నీకు రుణపడి వుంటుంది" అన్నారాయన ఆనందంగా.

"లేదు సార్! మీరంతా నాకు అలా రుణపడిపోకూడదనే నేనిలా వచ్చాను" అంటూ నేను చేతులు నలుపుకున్నాను.

"చెప్పవోయ్... ఏమిటి విషయం?" అన్నారాయన.

"దాన్ని కొనేందుకు నాకు పదివేలు ఖర్చయ్యాయి సార్. నేను కూడా చిరుద్యోగినే కదా! అంత ఖర్చు నేనొక్కడ్నే భరించలేను. సో... మీరంతా తలా ఒక చెయ్యేస్తే..."

"యూ మీన్ చందాలివ్వమంటావా?"

"ఎస్సార్... ఎగ్జాక్లీ..." ఒకింత బిడియంగా అన్నాను.

"భలేవాడివోయ్! దానికింత మొహమాటం దేనికి? నావంతు ఎంతివ్వమంటావో చెప్పు" అన్నారాయన నిండుగా నవ్వేస్తూ.

"ఓ ఫైవ్ హండ్రెడ్ ఇవ్వండి."

"విత్‌ప్లెజర్..." అంటూ లేచి వెళ్లి బీరువాలోంచి డబ్బు తీసుకొచ్చి నాచేతికందించారు.

"చాలా థాంక్స్ సార్" అన్నాను.

"థాంక్స్ మేమే నీకు చెప్పాలయ్యా! ఈ కాలనీకి నువ్వు చేసిన మహోపకారం సామాన్యమైంది కాదు" అన్నారు.

ఆయన నాకేసి మెరుస్తున్న కళ్లతో చూస్తుంటే నేను బిడియంగా నవ్వి ఆయన నుండి శెలవు తీసుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించాను.

* * *

"నిజంగానా?!" అన్నారు శేషగిరిరావుగారు.

"ఒట్టు సార్! వాడి పీడ మీకింక విరగడైపోయినట్టే" అన్నాను.

"అదే నిజమైతే ఆ స్వామివారికి నూరు కొబ్బరికాయలు కొడతాను" అన్నారాయన ఎంతో సంతోషంగా.

"అవసరం లేదు సార్... ఆ కొబ్బరికాయలకయ్యే ఖర్చేదో నాకిప్పించండి..." అని నవ్వి, వాడి ఆట నేనెలా కట్టించానో ఆయనకు వివరించాను.

"అంటే పదివేలు ఖర్చయ్యాయన్నమాట."

"అవున్సార్... నా పాకెట్ నుండి ఖర్చు చేశాను. కానీ నాదీ అంతంత మాత్రం పరిస్థితే కదా! అందుకే మన కాలనీ వాసులందరి దగ్గరా చందాలు వసూలుచేస్తున్నాను. వామన్రావుగారు అయిదు వందలు ఇచ్చారు. మీరు కూడా ఎంతో కొంత ఇస్తే బావుంటుంది" ఎంతైనా చందాలు వసూలుచెయ్యడం అదే మొదటిసారి కాబట్టి ఒకింత బిడియంగానే అనిపించింది నాకు. అందుకే తల దించుకుంటూ అడిగాను.

"దీన్లో సిగ్గుపడాల్సిందేముందోయ్! ధైర్యంగా అడిగి అందరి దగ్గరా వసూలుచెయ్యి. నువ్వేం నీ ఒక్కడి కోసం ఖర్చుపెట్టలేదుగా ఆ డబ్బు. మన కాలనీవాసుల క్షేమం కోసమే కదా ఖర్చుపెట్టావ్. సో... ఈ విషయంలో చందాలు వసూలుచేసే హక్కు నీకుంది. ఎంతో కొంత కాదు, వామన్రావుగారు ఐదొందలిచ్చారన్నావ్‌గా, నేనూ అంత ఇస్తాను" అంటూ లాల్చీజేబులోంచి ఓ అయిదొందలు బయటికి తీసి నా చేతికందించారు ఆయన.

"థాంక్సండీ" అన్నాను.

"థాంక్స్ మేమే నీకు చెప్పాలయ్యా!" ఈయన కూడా వామన్రావుగారన్నట్టే అన్నారు.

* * *

వామన్రావుగారు, శేషగిరిరావుగారూ చెరో ఐదొందలిచ్చారు సార్. మీరు కూడా ఎంతో కొంత ఇస్తే బావుంటుంది."

"ష్యూర్... వాడి పీడ నిజంగానే విరగడవ్వాలేగానీ డబ్బుదేముందీ, కుక్కని తంతే రాల్తాయి డబ్బులు." అంటూ లేచాడు సంపత్‌కుమార్.

వాళ్లింట్లో జూలీ అనే ఓ ఆడకుక్క వుంది. బహుశా దాన్ని తంతారేమోననుకున్నాను.

కానీ ఆయన దాన్ని తన్నకుండా, అదే గదిలో హేంగర్‌కి వేలాడుతున్న కోటుజేబులోంచి అయిదొందలు తీసుకొచ్చి నాచేతికందించారు.

ఆయన ఆ డబ్బు కుక్కని తన్ని ఇచ్చారా, లేక కోటుజేబులోంచి తీసిచ్చారా అన్నది కాదుగదా నాకు ముఖ్యం? అంచేత "థాంక్సండీ" అంటూ ఆయనందించిన నోట్లు మడిచి జేబులో పెట్టుకున్నాను.

ఆశ్చర్యం... ఆయనా అదే మాటన్నాడు.

"థాంక్స్ నువ్వెందుకయ్యా చెప్పడం? ఆ థాంక్సేదో మేమే నీకు చెప్పాలి."

ఆయనలా అంటుంటే 'ఒరేయ్ పైడిరాజూ! నీ దెబ్బ సామాన్యమైంది కాదురా!' అనుకున్నాను మనసులో.

"ఇట్సాల్‌రైట్ సార్!" అనేశాను పైకి.

* * *

"...సమాధి కట్టేశానాంటీ?"

ఆండాళ్లమ్మగారు ఆనందంగా నవ్వారు.

"నిజమా బాబూ! ఎంత గుడ్‌న్యూస్ చెప్పావు" అన్నారు సంబరంగా.

దరిమిలా నేనామెకు విషయం వివరించాను.

"దాందేముంది నాయనా! అయిదొందలు కాకపోతే ఆరొందలు తీసుకో. నిత్యం డొక్కునే బాధ తప్పించావు. దాని ముందు ఇదేపాటి?" అంటూ ప్రక్కగదిలోకి వెళ్లి ఓ నిముషం తర్వాత చేతిలో చిన్నపాటి నోట్లకట్టతో బయటికొచ్చారావిడ.

"అయిదొందలా" అంటూ ఆవిడ ఆ నోట్లకట్టని నాచేతి కందిస్తుంటే "థాంక్సాంటీ" అంటూ అందుకున్నాను.

ఆశ్చర్యాతి ఆశ్చర్యం!

ఆవిడ కూడా అదేమాట అన్నారు.

"చెప్తే గిప్తే ఆ థాంక్సేదో మేమే నీకు చెప్పాలి బాబూ? నువ్వెందుకు చెప్పటం?"

'పైడిరాజూ... రేయ్! నువ్వు అరివీర భయంకరుడివిరా!' అనుకున్నాను మనసులో.

"ఇట్సాల్‌రైట్ ఆంటీ" అని పైకి అనేసి, అక్కణ్ణుంచి నాగేశ్వరరావుగారింటికి బయల్దేరాను.

* * *

"దాందేముందోయ్..." అన్నారు నాగేశ్వరరావుగారు. ఫలితంగా నా జేబులోకి మరో అయిదొందలు చేరాయి.

"సంతోషంగా ఇస్తానోయ్..." అన్నారు శ్రీనివాసశర్మ. ఫలితంగా నా జేబులోకి ఇంకో అయిదొందలు చేరాయి.

"అరె... పట్టుకెళ్లు భాయ్! అయిదొందలికి ఫికర్ చేస్తానా?" అన్నాడు ఇస్మాయిల్‌ఖాన్‌గారు. ఫలితంగా నా జేబులోకి ఇంకో అయిదొందలు చేరాయి.

"విత్‌ప్లజర్ మైడియర్ యంగ్‌బోయ్! ఆ ప్రభువు నిన్ను ఆశీర్వదిస్తాడు" అన్నాడు విక్టర్ పాల్‌గారు. ఫలితంగా నా జేబులోకి ఇంకో అయిదొందలు చేరాయి.


"ఓర్నీ పాసుగాలా! ఎంత శుభవార్త చెప్పేవయ్యా! నేనంత ఇచ్చుకోలేనుగానీ రెండొందలిస్తా, సరేనా?" అంటూ దీర్ఘాలు తీశాడు నెల్లూరు నుండొచ్చి మా కాలనీలో ఓ పాన్ షాప్ తెరిచి సెటిలైపోయిన పెంచలయ్య. ఫలితంగా నా జేబులో ఇంకో రెండొందలు చేరాయి.

"ఏటేటేటీ... అణ్ణి నమాధి చేసేసినావా... ఓలమ్మో లమ్మో లమ్మో... నిజంగా?! ఎర్రిబేవినాగ ఎంటబడేవోడు... ఎంత నల్లటి మాట సెప్పినావు బావూ... పనిముండని, అంతంటే నావొల్ల కాదులేగానీ... ఇంద, ఈ వొందుంచు" అంది తూర్పునుండొచ్చి మా కాలనీ అంతటికీ ఏకైక పనిమనిషిగా విరాజిల్లుతున్న నూకాలమ్మ. ఫలితంగా నా జేబులోకి మరో వంద చేరింది.

అలా సాయంత్రం వరకూ దండుడు కార్యక్రమం కొనసాగించి బరువెక్కిన జేబుల్తో బాగా పొద్దుపోయాక మా రూంకి చేరుకున్నాను.

నేనొచ్చేసరికి మా రూమ్మేట్ పైడిరాజు ఉరఫ్ పైడిశ్రీ, నేను చెన్నై నుంచి కొనుక్కొచ్చిన ఇంపోర్టెడ్ డాల్ ముందు నిలబడి...

"ఉడత ఉలిక్కిపడింది, ఉరుము ధ్వని విని... ఉడత ఉలిక్కిపడింది, ఉరుము ధ్వని విని... ఓ వినీలాకాశమా!... ఓ వినీలాకాశమా!... అన్ని తారలు నీకెందుకు?... అన్ని తారలు నీకెందుకు?" అంటూ తన కవిత్వాన్ని వినిపిస్తున్నాడు దానికి. వాడి కవిత్వానికి పరవశించిపోతున్నట్టు ఆ బొమ్మ అటూ ఇటూ తలాడిస్తూ వుంది.



అది నిజంగానే మనిషంత సైజులో వున్న ఒక ఇంపోర్టెడ్ బొమ్మ. దాదాపుగా ఓ రోబో లాంటిది. చాలా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రూపొందించబడిన బొమ్మ అది. దానిముందు నిలబడి ఎవరైనా మాట్లాడితే ఆ వ్యక్తి స్వరంలోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా నిజంగానే జీవమున్న మనిషిలా అది తలాడిస్తూంటుంది.

అఫీషియల్ డ్యూటీ మీద మొన్న చెన్నై వెళ్లినప్పుడు ఒక షాపులో అది కనిపిస్తే పదివేలు పెట్టి కొనుక్కొచ్చాను.

మా పైడిశ్రీగాడి కవితాపఠనం వల్ల మా కాలనీ వాసులందరూ భయపడిపోతున్నారని తెలుసు కాబట్టి, దాన్ని కొనుక్కొచ్చి రూమ్‌లో పడేస్తే, వాడింక తన కవితల్ని దానికి వినిపించుకుంటూ రూమ్‌లోనే సమాధి అయిపోతాడన్న నమ్మకంతో. తద్వారా వందలాది మందిని మానసిక క్షోభ నుండి తప్పించవచ్చనే సదాశయంతో అంత డబ్బు పోసి ఆ బొమ్మని కొనుక్కొచ్చాను.

నా నమ్మకం వమ్ముకాలేదు.

ఆ బొమ్మ వచ్చినప్పట్నుంచి వాడు తన కవితల్ని వినిపించటానికి ఇంకెవ్వరి దగ్గరికీ వెళ్లటం మానేశాడు.

"ఉడత ఉలిక్కిపడింది, ఉరుము ధ్వని విని. ఉడత ఉలిక్కి..." వాడు బొమ్మ ముందు నిలబడి తన కవిత్వాన్ని వినిపిస్తుంటే... నేను వసూలైన చందాలన్నీ ఒకచోట కుప్పగా పోసి లెక్కించడం ప్రారంభించాను.

ఆశ్చర్యం!

బొమ్మ ఖరీదు పదివేలు పోను, ఇంకా ఓ పదివేలకు పైగానే లాభం వచ్చింది నాకు.

'హేట్సాఫ్ టు యువర్ కవిత్వం!' అనుకున్నాను మనసులో వాణ్ణి ఉద్దేశించి.

"ఓ వినీలాకాశమా!... ఓ వినీలాకాశమా!... అన్ని తారలు..." వాడింకా తన కవిత్వాన్ని వినిపిస్తూనే వున్నాడు.

బొమ్మ నిర్విరామంగా తల ఊపుతూనే వుంది. ❀